www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

సోమవారం
19.10.2026

శ్రీగౌరి నీ పూజ సేతురమ్మ ఉయ్యాలో అంటూ లయబద్ధంగా సాగే ఆడబిడ్డల గొంతులు నేడు డీజేల రణగొణ ధ్వనుల కింద శాశ్వతంగా నలిగిపోతున్నాయి. ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ పల్లె పరవశించి పాడే మౌఖిక సాహిత్య వైభవాన్ని, మా అన్నలు వచ్చారు ఉయ్యాలో అంటూ తోడబుట్టినవారి కోసం తపించే కన్నీటి ఆరాటాన్ని వికృత చిందులు నిలువునా మింగేస్తున్నాయి. అత్తగారింటి కష్టాలు, పుట్టింటి మమకారాలు, పల్లె బతుకు చిత్రణలను గుండె లోతుల నుంచి తీర్చిదిద్దిన జానపద సొగసును సినిమా రికార్డింగ్ పాటలు బజారున పడేస్తున్నాయి. చేతుల చప్పట్లు, పాదాల లయ, ఒకరికొకరు వంతపాడే సామూహిక ఐక్యత స్థానంలో వెకిలి డాన్సులు, చెవులు చిల్లులు పడే సౌండ్ బాక్సుల పైత్యం రాజ్యమేలుతోంది. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ పేరిట సాగుతున్న ఈ నయా విధ్వంసంపై, మూగబోయిన తెలంగాణ ఆడబిడ్డల నోటిపాటల వేదనపై 'కలంజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక విశ్లేషణాత్మక కథనం.

- వీధివీధినా హోరెత్తిన డీజేల మోతలు.. గుండెలు ఆగిపోయే శబ్దాలు
- డీజే సప్పులతో మూగబోయిన ఆడబిడ్డల నోటి పాటలు
- చేతి చప్పట్లు, అడుగుల లయబద్ధత కనుమరుగు
- పుట్టింటి మమకారం, అన్నల ప్రేమ పాటలు మాయం
- గౌరమ్మ ఆటను మింగేసిన నెట్టుళ్లు, తోపులాటలు
- అత్తగారింటి బాధలను పంచుకునే ఆత్మీయతకు తెర
- సినిమా పాటల మోతతో అభాసుపాలైన పల్లె సంప్రదాయం
- ఒకరికొకరు గొంతు కలిపే ఆడబిడ్డల ఐక్యత గల్లంతు
- కాలగర్భంలోకి తెలంగాణ భాష, యాసల అందం
- తరతరాల అపురూప జానపద వారసత్వానికి తూట్లు



3లో..

డీజే పైత్యంతో తెలంగాణ సంస్కృతికి చరమగీతం

సంస్కృతికి పాడారు.. డింఛిక్.. డింఛిక్!

పవిత్రమైన పండుగ కాస్తా.. డీజే షోగా మారిన బతుకమ్మ



- ఊరూవాడల్లో హోరెత్తిన పెద్ద బతుకమ్మ సంబురాలు
- ట్యాంక్‌బండ్‌పై సర్కారు సంబరం.. ప్రత్యేక ఆకర్షణగా రష్మిక-విజయ్
- గంగమ్మ ఒడికి చేరిన గౌరమ్మ.. వాయనాలు ఇచ్చిపుచ్చుకున్న మహిళలు
- పలుచోట్ల సరైన వసతులు కల్పించకపోవడంతో తప్పని ఇబ్బందులు

అంబరాన్నంటిన సద్దుల సంబురం

లోపలి పేజీలో..

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
సోమవారం 19.10.2026
www.kalamjyothi.com



అంబరాన్నంటిన సద్దుల సంబురం















కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 19) : తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే పెద్ద బతుకమ్మ ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటాయి. ఎంగిలిపూలతో మొదలై తొమ్మిది రోజుల పాటు సాగిన పూల పండుగ ఆదివారం నాటి సద్దుల బతుకమ్మతో వైభవంగా ముగిసింది. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తలపై ఎత్తుకుని ఆడబిడ్డలు ఆలయాలు, కూడళ్లు, చెరువు కట్టల వద్దకు తరలి వచ్చారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు గౌరమ్మ ఉయ్యాలో అంటూ లయబద్ధమైన చప్పట్లు, పాటలతో ఊరూవాడలను హోరెత్తించారు. పల్లె, పట్టణం తేడా లేకుండా మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ఆడిపాడటంతో వాకిళ్లన్నీ పూల వనాలుగా మారాయి.

ట్యాంక్‌బండ్‌పై సర్కారు సంబరం..

హుస్సేన్‌సాగర్ తీరాన ట్యాంక్‌బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు, లేజర్ షో, బాణసంచా కాంతులతో సాగర తీరం ధగధగా మెరిసిపోయింది. గవర్నర్ సతీమణి జానకి, మంత్రి సీతక్కతో పాటు ప్రముఖ సినీనటులు రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ దంపతులు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నగరవాసులు భారీ సంఖ్యలో తరలివచ్చి బతుకమ్మల చుట్టూ కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.

గంగమ్మ ఒడికి చేరిన గౌరమ్మ..

ఆటపాటల అనంతరం మహిళలు బతుకమ్మలను చెరువులు, వాగులు, కుంటల వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. పోయిరా గౌరమ్మ పోయిరావమ్మ మళ్లొచ్చే ఏడాదికి తిరిగి రావమ్మ అంటూ భక్తిభావంతో బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం పూర్తయిన తర్వాత మహిళలు వెంట తెచ్చుకున్న సద్దులను ఆరగిస్తూ, ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుని ఆత్మీయతను చాటుకున్నారు. కుటుంబాలు చల్లగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని గౌరమ్మను వేడుకున్నారు.

జిల్లాల్లో వెల్లివిరిసిన పూల జాతరల సందడి..

హనుమకొండలోని పద్మాక్షి గుట్ట, వడ్డేపల్లి చెరువు, వరంగల్‌లోని చిన్నవడ్డేపల్లి చెరువు, రంగలీలా మైదానం, జనగామలోని బతుకమ్మ కుంట వద్ద వేడుకలు ఘనంగా జరిగాయి. జయశంకర్ భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియం, మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం, ములుగులోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన సంబురాల్లో వేలాదిగా మహిళలు పాల్గొన్నారు. తీరొక్క పూల సోయగాలతో ఆయా మైదానాలు, ఘాట్లు పూలవనాలను తలపించాయి.





కలంజ్యోతి
తెలుగు దినపత్రిక

3

సోమవారం 19.10.2026

www.kalamjyothi.com

- హోరెత్తిన డీజేల మోతలు.. గుండెలు ఆగిపోయే శబ్దాలు
- డీజే సప్పులతో మూగబోయిన ఆడబిడ్డల నోటి పాటలు
- చేతి చప్పట్లు, అడుగుల లయబద్ధత కనుమరుగు
- పుట్టింటి మమకారం, అన్నల ప్రేమ పాటలు మాయం
- గౌరమ్మ ఆటను మింగేసిన నెట్టోడులు, తోపులాటలు
- అత్తగారింటి బాధలను పంచుకునే ఆత్మీయతకు తెర
- సినిమా పాటల మోతతో అభాసుపాలైన పల్లె సంప్రదాయం
- ఒకరికొకరు గొంతు కలిపే ఆడబిడ్డల ఐక్యత గల్లంతు
- కాలగర్భంలోకి తెలంగాణ భాష, యాసల అందం
- తరతరాల అపురూప జానపద వారసత్వానికి తూట్లు



సంస్కృతికి పాడారు.. డించిక్.. డించిక్!

■ డీజే పైత్యంతో తెలంగాణ సంస్కృతికి చరమగీతం ■ పవిత్రమైన పండుగ కాస్తా.. డీజే షోగా మారిన బతుకమ్మ



కలంజ్యోతి బ్యూరో (అక్టోబర్ 19) : తెలంగాణ సాంస్కృతిక జీవన విధానానికి పరాకాష్టగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ డీజేల పైత్యంతో తన అసలైన వైభవాన్ని కోల్పోతోంది. శ్రీలక్ష్మి దేవమ్మ ఉయ్యాలో సృష్టి బతుకమ్మ ఉయ్యాలో అంటూ భక్తిభావంతో సాగాల్సిన ఆచారాలు, విలువలు, సంప్రదాయాలను కాలరాస్తూ ఆధునికత పేరిట వికృత పోకడలు రాజ్యమేలుతున్నాయి. పూలను కొలిచే పవిత్రమైన వేడుకను అర్థంపర్థం లేని హంగామాగా మార్చేసి, మన సొంత సాంస్కృతిక మూలాలకే చరమగీతం పాడుతున్న దుస్థితి పల్లెలు, పట్టణాల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

డీజే షోగా మారిన బతుకమ్మ..

ఆడబిడ్డలంతా ఒక్కచోట చేరి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆత్మీయంగా జరుపుకోవాల్సిన పండుగ నేడు బహిరంగ డీజే ప్రదర్శనగా మారిపోయింది. పల్లె వీధుల్లో, పట్టణ చౌరస్తాల్లో వేదికలు ఏర్పాటు చేసి భారీ స్పీకర్లు పెట్టి సంబరాన్ని అపహాస్యం చేస్తున్నారు. పవిత్రమైన భక్తి భావం, ప్రకృతి పట్ల గౌరవం ఉండాల్సిన చోట కృత్రిమమైన ఆర్భాటాలు, ప్రదర్శనా బుద్ధి మాత్రమే మిగిలాయి.

వీధివీధినా హోరెత్తిన డీజేల మోతలు..

ఊరూవాడా ఎక్కడ చూసినా చెవులు చిల్లులు పడేలా డీజేల మోతలు మార్మోగాయి. వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, రోగులు ఆ భీకర శబ్దాలకు తట్టుకోలేక ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. పండుగ అంటే ప్రశాంతత, ఆనందం పంచాల్సింది పోయి, గుండెలు అదిరిపోయే రణగొణ ధ్వనులతో వీధులను యుద్ధక్షేత్రాలుగా మార్చేశారు.

మూగబోయిన ఆడబిడ్డల నోటి పాటలు..

గ్రామీణ మహిళల గొంతులోంచి సహజంగా జాలువారే కల్యాణమోయమ్మ కల్యాణమే వంటి జానపద పాటలు డీజే సౌండ్ బాక్సుల చప్పుళ్ల కింద నలిగి పూర్తిగా మూగబోయాయి. మైకుల నుంచి వెలువడే కర్కశకఠోర శబ్దాల ధాటికి ఆడబిడ్డలు నోరు తెరిచి పాడే అవకాశమే లేకుండా పోయింది. తమ భావాలను పాటల రూపంలో పంచుకునే సహజసిద్ధమైన హక్కును సాంకేతిక హోరు నిర్దాక్షిణ్యంగా లాక్కుంది.

చేతి చప్పట్లు, అడుగుల లయబద్ధత కనుమరుగు..



చిత్తూ చిత్తూల గువ్వ చిరుతల్ల గువ్వ అంటూ బతుకమ్మ చుట్టూ గుండ్రంగా తిరుగుతూ లయబద్ధంగా వేసే అడుగులు, రెండు చేతులతో కొట్టే మృదువైన చప్పట్లు పండుగకు అసలైన శోభను తెస్తాయి. అయితే ఆ శ్రావ్యమైన లయబద్ధత స్థానంలో నేడు వికృతమైన, అసభ్యకరమైన డాన్సులు వచ్చి చేరాయి. తాళం, లయ లేని గంతులు వేస్తూ పవిత్రమైన సంప్రదాయ నృత్య రీతులను అపహాస్యం చేశారు.

పుట్టింటి మమకారం, అన్నల ప్రేమ పాటలు మాయం..

మా అన్నలు వచ్చారు ఉయ్యాలో మాయమ్మ పంపింది ఉయ్యాలో అంటూ పుట్టింటికి ఆదరంగా తీసుకెళ్లే అన్నదమ్ముల ప్రేమను గుర్తుచేసే అనుబంధాల పాటలు ఎక్కడా వినిపించలేదు. కుటుంబ బంధాలను, రక్తసంబంధాల మాధుర్యాన్ని గుర్తుచేసే సాహిత్యానికి బదులు అర్థం లేని అరుపులు, కేకలతో కూడిన రికార్డింగ్ శబ్దాలే వీధులను ముంచెత్తాయి.

నెట్టుళ్లు, తోపులాటలు..

గౌరీదేవి చుట్టూ ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో తిరుగుతూ ఆడాల్సిన ఆటను ఆకతాయిల తోపులాటలు, నెట్టోడులు మింగేశాయి. డీజేల ముందు ఎగిరిపడే యువకుల హంగామాతో మహిళలు బతుకమ్మను ఆడటానికే భయపడే పరిస్థితులు దాపురించాయి. పవిత్రమైన ప్రాంగణాలు కాస్తా అదుపులేని రచ్చబండలుగా మారిపోయాయి.

ఆత్మీయతకు తెర..

ఒక్కేసి పువ్వేసి చందమామ శివుడూరి బాటల్ల చందమామ అంటూ సంవత్సరమంతా అత్తగారింట్లో పడ్డ కష్టాలు, కన్నీళ్లను బతుకమ్మ సాక్షిగా పంచుకునే గొప్ప సాంఘిక వేదిక బతుకమ్మ. తోటి మహిళలతో ఆత్మీయంగా బాధలను చెప్పుకుని మనసు తేలిక చేసుకునే ఆ సాంత్వన నేటి డీజేల హోరులో కొట్టుకుపోయింది. మహిళల భావోద్వేగాలకు, ఆంతరంగిక వేదనలకు విలువ లేకుండా పోయింది.

అభాసుపాలైన పల్లె సంప్రదాయం..

భక్తి, ప్రకృతి ఆరాధనతో నిండిన సంప్రదాయ బతుకమ్మ పాటల స్థానంలో అర్థంపర్థం లేని సినిమా రికార్డింగ్ పాటలు, ఐటెం సాంగులు హోరెత్తాయి. పల్లె సంస్కృతి గొప్పదనాన్ని నలుగురికీ చాటాల్సిన పర్వదినాన ఇలాంటి సినిమా రికార్డింగ్ పాటలు వేసి సంస్కృతిని బజారున పడేశారు. పవిత్రమైన పండుగ నేపథ్యాన్ని కాలరాశారు.

ఆడబిడ్డల ఐక్యత గల్లంతు..

ఒకరు పాట ఎత్తుకుంటే మిగిలిన మహిళలంతా గొంతు కలిపి పంతపాడే సామూహిక జీవన సౌందర్యం బతుకమ్మ సొంతం. ఆత్మీయంగా కలిసి పాడటం వల్ల పెరిగే ఐక్యతా భావం నేడు ఎక్కడా కనిపించలేదు. ఎవరికి వారు మైకుల శబ్దాల వైపు చూస్తూ ఉండిపోవడంతో సంఘటిత శక్తి, పరస్పర అనురాగం గల్లంతయ్యాయి.

కాలగర్భంలోకి తెలంగాణ భాష, యాస..

పచ్చి పల్లె పదాలు, తెలంగాణ మట్టి యాస, భాషా సొగసు బతుకమ్మ పాటల్లోనే సజీవంగా ఊపిరిపోసుకుంటాయి. అటువంటి సహజమైన తేట తెలుగు పదాలు రానురాను కనుమరుగవుతూ కాలగర్భంలో కలిసిపోతున్నాయి. మన భాషా సంపదను కాపాడుకునే అరుదైన అవకాశాన్ని ఇలాంటి పోకడల వల్ల నేలపాలు చేసుకుంటున్నాం.

బతుకమ్మ అంతరార్థం కనుమరుగు..

రుద్రాక్ష పూలారబోసినారమ్మ ఉయ్యాలో గునుగు పూలారబోసినారమ్మ ఉయ్యాలో అంటూ ఔషధ గుణాలున్న పూలతో గౌరమ్మను కొలిచి, చెరువులను శుద్ధి చేయాలనే గొప్ప పర్యావరణ స్పృహ ఈ పండుగలో ఉంది. ఆ ప్రకృతి అంతరార్థాన్ని గాలికొదిలేసి కేవలం ప్రదర్శనలు, శబ్ద కాలుష్యం, విద్యుత్ దీపాల ఆర్భాటాలకే పరిమితం కావడంతో పండుగ పరమార్థం దెబ్బతింటోంది.

జానపద వారసత్వానికి తూట్లు..

రాతపూర్వకంగా కాకుండా నోటిమాటగా పూర్వీకుల నుంచి వారసత్వంగా అందుతున్న వేలాది జానపద గేయాలకు నేటి పోకడలతో గొడ్డలిపెట్టు తగిలింది. నేటి తరం ఈ పాటలను నేర్చుకోకపోవడం, పెద్దలు నేర్పించకపోవడం వల్ల రేపటి తరానికి అసలైన బతుకమ్మ సంస్కృతి మిగలకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికైనా సమాజం, మేధావులు స్పందించి మన మూలాలను కాపాడుకోవాల్సిన తక్షణ అవసరం ఉంది.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
సోమవారం 19.10.2026
4
www.kalamjyothi.com

దుర్గామాత రూపంలో వాసవీమాత దర్శనం





కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 18) : జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో 56వ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు వాసవీమాత మూలవిరాట్‌ను దుర్గాదేవి రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జోషి పాండురంగ శర్మ వేదమంత్రోచ్ఛారణల నడుమ 112 మంది దంపతులతో మహా చండీయాగాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు. లోక కళ్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ప్రాంత సుభిక్షం కోసమే ఈ యాగం చేపట్టినట్లు శ్రీశైలం మల్లికార్జున సత్రం చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బిళ్ళకంటి హరిబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య తెలిపారు. సాయంత్రం మహిళలతో లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చన, బెల్లంతో గుడార్చన, పల్లకిసేవ, డోలోత్సవం నిర్వహించగా, మాస్టర్ బంగారు బాబు ఆధ్వర్యంలో ఓం శ్రీ రక్ష కోలాట బృందం ప్రదర్శించిన కాళీమాత నృత్యరూపకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం ప్రముఖులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి : రాణా ప్రతాప్ రెడ్డి



కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 18) : త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ప్రార్థించారు. ఉత్సవాలను నిబద్ధతతో నిర్వహిస్తూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్న త్రిశూల్ యూత్ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, నాయకులు జూలూరు మనీష్ గౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, కొంకిసా విగ్నేష్ గౌడ్, ఠాకూర్ విజయ్ సింగ్, అబ్బరబోయిన రాజు, చిలువేరు అన్వేష్, త్రిశూల్ యూత్ సభ్యులు కందగట్ల చిన్ని కృష్ణ, ఆముదాల శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో అంబరాన్నంటిన సద్దుల సంబురం







కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 18) : ఎల్లారెడ్డిపేట మండలంలోని గ్రామాల్లో తొమ్మిది రోజుల పూల పండుగ సద్దుల బతుకమ్మ వేడుకలతో ఆదివారం అంగరంగ వైభవంగా ముగిసింది. స్థానికంగా లభించే తంగేడు, గునుగు వంటి వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది గ్రామాల్లోని కూడళ్ల వద్దకు చేర్చారు. సంప్రదాయ వస్త్రధారణతో హాజరైన మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మల చుట్టూ వలయాకారంగా తిరుగుతూ లయబద్ధమైన చప్పట్లతో బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ సందడి చేశారు. పసుపుతో చేసిన గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆడబిడ్డలు ప్రార్థించారు. కూడళ్ల వద్ద ఆటపాటలు ముగిసిన అనంతరం మహిళలు బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువులు, కుంటలు, వాగుల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. నిమజ్జనం పూర్తయిన తర్వాత మహిళలు వెంట తెచ్చుకున్న సద్దులను, వాయనాలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటూ ఆత్మీయతను చాటుకున్నారు. మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పంచాయతీల పాలకవర్గాలు బతుకమ్మ ఘాట్ల వద్ద విద్యుత్ దీపాలు, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించడంతో పండుగ సంబరాలు మండలవ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఘనంగా ముగిశాయి.

నాగారంలో ఘనంగా బతుకమ్మ సంబురాలు



కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 19) : హత్నూర మండల పరిధిలోని నాగారం గ్రామంలో ఆదివారం నాడు సద్దుల బతుకమ్మ వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాగారం ఉప సర్పంచ్ మీసాల నర్సింలు మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయాలకు ప్రత్యేకంగా నిలిచే పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గామాత రూపంలో అమ్మవారి దర్శనం

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 19) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు వాసవీ మాత మూలవిరాట్‌ను దుర్గాదేవి రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భజన మండలి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ఘనంగా ఆయుధ పూజ నిర్వహణ


కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 18) : విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా సాయుధ దళం కార్యాలయంలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ పోలీస్ శాఖకు చెందిన ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి జరుపుకుంటామని పేర్కొన్న ఆయన, ప్రజలకు నిరంతరం రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతలను కాపాడటమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచిస్తూ జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అశోక్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు జగన్, రాఘవరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
సోమవారం 19.10.2026
www.kalamjyothi.com

బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికుల ఫైల్ ఎక్కడ?

- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్..
- విధుల్లోకి తీసుకోవడంలో నిర్లక్ష్యం ఎందుకు..?
- అమలు కాని కలెక్టర్ ఆదేశాలు
- తక్షణమే విధుల్లోకి తీసుకొని ప్రజారోగ్యాన్ని కాపాడాలి



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 18) : బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ వరంగల్ జిల్లాలో మాత్రం ఆ ఉత్తర్వులు అమలుకు నోచుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా గ్రామాల్లో దోమల ఉత్పత్తి కేంద్రాల గుర్తింపు, సర్వే, స్ప్రే పనుల కోసం కార్మికులను నియమించాలని ఆదేశాలు ఉన్నా జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి పంపిన ఫైల్ ఎక్కడుందో తెలియడం లేదని, రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ఇప్పటికే కార్మికులను తీసుకున్నారని, ఇక్కడ మాత్రం అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని వాపోయారు.

కలెక్టర్ ఆదేశించినా అమలు కాలేదు..

ఈ నెల 12న ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదను కలిసి వినతిపత్రం అందించగా, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డిని ఆదేశించినట్లు కార్మికులు గుర్తుచేశారు. మూడు రోజుల్లో ఉత్తర్వులు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చి రోజులు గడుస్తున్నా ఆచరణలోకి రాలేదని మండిపడ్డారు. జిల్లా మలేరియా అధికారి అసలు ఉన్నారా? లేరా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఫైలుపై సంతకాలు, అనుమతుల పేరుతో కార్యాలయాల చుట్టూ తిప్పుతూ తమ కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని వాపోయారు.

తక్షణమే విధుల్లోకి తీసుకొని ప్రజారోగ్యాన్ని కాపాడాలని డిమాండ్.

గ్రామాల్లో డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్య పరిరక్షణకు తమ సేవలను వినియోగించుకోవాలని బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులు విజ్ఞప్తి చేశారు. తమను వెంటనే విధుల్లోకి తీసుకుని ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు భూక్య శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిన్నపెల్లి దేవేందర్, ముత్యం రాజు, శేఖర్, రామ్‌చందర్, భద్రయ్య, సూర్య, రవి, బాబు, రామ్‌కుమార్, సీహెచ్ రాజు, దేవేందర్, రాజేశ్వరరావు, చాణిక్య, సరిత, సల్లా వుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని ఉద్యోగుల నిరసన



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 18) : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆరో రోజుకు చేరింది. ఆదివారం ఎన్‌హెచ్‌ఎం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు సమ్మె శిబిరం వద్ద మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు కల్పించాలని కోరారు. ఏళ్ల తరబడి సేవలందిస్తున్న తమకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపేంతవరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, జనరల్ సెక్రటరీ దామగట్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేటలో బీఆర్ఎస్ ఫ్లెక్సీ చింపివేత

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 18) : చెన్నారావుపేట మండల కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీని చింపివేయడం తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న వెంటనే బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఫ్లెక్సీని కావాలని చింపివేసి ఉద్రిక్తతలు సృష్టించేందుకు యత్నించారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ఘటనకు పాల్పడిన బాధ్యులను వెంటనే గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు.

పెద్ది చిత్రపటానికి పాలాభిషేకం..

అనంతరం నర్సంపేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి విశేష కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే, ఉద్యమ నేత స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి బాల్నే వెంకన్న నేతృత్వంలో నాయకులు ఘనంగా పాలాభిషేకం చేశారు. నర్సంపేట ప్రాంత ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, ప్రజల గుండెల్లో ఆయనకు శాశ్వత స్థానం ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్, మాజీ సొసైటీ చైర్మన్లు చింతకింది వంశీ, మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు అనుముల కుమారస్వామి, అమ్మ రాజేష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, మండల ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్, మాజీ సర్పంచులు కుండే మల్లయ్య, గుగులోతు స్వామి నాయక్, మాజీ డైరెక్టర్ జున్నుతుల శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదాసి కుమారస్వామి, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి బోడ మురళి నాయక్, నాయకులు ములుక సాంబయ్య, లాలు నాయక్, రసమల సతీష్, సురేందర్, గ్రామ పార్టీ అధ్యక్షులు కందగట్ల సాంబయ్య, మొర్రి కట్టయ్య, జైపాల్‌రెడ్డి, అడుప రమేష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఎస్సైకి గోవర్ధన్‌కు బీఆర్ఎస్ సన్మానం

ఫ్లెక్సీ చింపివేత ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 18) : చెన్నారావుపేట మండలానికి నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పొన్నాల గోవర్ధన్‌ను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చింపివేసిన ఘటనను ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులను గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్, మాజీ సొసైటీ చైర్మన్లు చింతకింది వంశీ, మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు అనుముల కుమారస్వామి, అమ్మ రాజేష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, మండల ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్, మాజీ సర్పంచులు కుండే మల్లయ్య, గుగులోతు స్వామి నాయక్, మాజీ డైరెక్టర్ జున్నుతుల శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదాసి కుమారస్వామి, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి బోడ మురళి నాయక్, నాయకులు ములుక సాంబయ్య కవి, రసమల సతీష్, సురేందర్, జైపాల్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కందగట్ల సాంబయ్య, మొర్రి కట్టయ్య, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
6
సోమవారం 19.10.2026
www.kalamjyothi.com





కూచుకుల్ల క్యాంపు కార్యాలయంలో

చిన్నారులతో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి సందడి

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 18) : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి పాల్గొని చిన్నారులతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఆడబిడ్డలు అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ మహిళలు, చిన్నారులు సంప్రదాయ పాటలు పాడుతూ ఆడిపాడారు. ప్రజాప్రతినిధి స్వయంగా పిల్లలతో కలిసి వేడుకల్లో పాలుపంచుకోవడంతో కార్యాలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సాగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







నాగర్‌కర్నూల్ డిపోలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 18) : నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిపోకు చెందిన మహిళా ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, భక్తిశ్రద్ధలతో పూజలు చేసి గౌరమ్మ పాటలకు ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకల్లో డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, ఏడీసీ, సూపర్‌వైజర్లు, గ్యారేజ్ సిబ్బంది, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హత్నూరలో బతుకమ్మ సంబరాలు





తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పూల పండుగ

కలంజ్యోతి, హత్నూర (అక్టోబర్ 19) : హత్నూర మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న హత్నూర తహసీల్దార్ పర్వీన్ షేక్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఆటపాటలతో ఎంతో ఉత్సాహంగా సాగిందని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు, స్థానిక మహిళలు తంగేడు, గులాబీ, చామంతి, గునుగు వంటి తీరొక్క రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ లయబద్ధమైన చప్పట్లతో సంప్రదాయ పాటలు పాడుతూ సందడి చేయడంతో కార్యాలయ ప్రాంగణంలో పండుగ శోభ వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న ..

పుట్టిన నేలను మరువలేను

- **స్వస్థలంలో బతుకమ్మ, దసరా వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందం**
- **ఎన్ని శిఖరాలు అధిరోహించినా మన మూలాలను నిత్యం గౌరవించాలి**
- **నేటి యువత లక్ష్యాలతో పాటు సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లాలి**



కలంజ్యోతి, వరంగల్ (అక్టోబర్ 19) : ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా పుట్టి పెరిగిన నేల, మన సంస్కృతే మనకు అసలైన గర్వకారణమని అంతర్జాతీయ స్థాయి పేజెంట్ విజేత శ్రావ్య గడ్డమీది పేర్కొన్నారు. గ్లామర్ గురుగ్రామ్ వేదికపై మిసెస్ ఫిట్‌నెస్ ఫ్రీక్ - మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్ 2025 టైటిల్‌ను, ఎస్కే టాప్ యూనివర్స్ ఇండియా ఇంటర్నేషనల్ 2026లో మిసెస్ గ్లోరీ టైటిల్‌ను గెలుచుకుని గుర్తింపు తెచ్చుకున్న ఆమె బతుకమ్మ, దసరా పండుగలను జరుపుకోవడానికి స్వస్థలమైన వరంగల్‌కు వచ్చారు. వృత్తిపరంగా ఎన్ని విజయాలు సాధించినా సంస్కృతి, సంప్రదాయాలను ఎప్పటికీ విస్మరించకూడదనే ఉద్దేశంతో ఏటా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మధ్య వేడుకల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

ఎన్ని శిఖరాలు అధిరోహించినా మన మూలాలను నిత్యం గౌరవించాలి..

బంధువులు, స్నేహితులు, స్థానిక మహిళలతో కలిసి సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఆడటం, పాటలు పాడటం ఎనలేని సంతృప్తిని ఇస్తుందని శ్రావ్య గడ్డమీది వివరించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించినా ప్రతి ఒక్కరూ తమ మూలాలను, సొంత సంస్కృతిని నిరంతరం గౌరవించాలని ఆకాంక్షించారు. నేటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తూనే, యువత తమ కలలను, ఆశయాలను సాకారం చేసుకుంటూనే మన పండుగలు, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాల కోసం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఆడబిడ్డలందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు



కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 19) : సద్దుల బతుకమ్మ, విజయదశమి పర్వదినాల సందర్భంగా హత్నూర మండల ప్రజలకు, ఆడబిడ్డలకు నాగారం ఉప సర్పంచ్ మీసాల నర్సింలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రజల మధ్య అనుబంధాలను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. తంగేడు, గునుగు, గుమ్మడి, చామంతి వంటి పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకుంటున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగకు అధికారిక గుర్తింపునిచ్చి ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం కల్పించిందని వివరించారు. రాబోయే 2028 ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
7
సోమవారం 19.10.2026
www.kalamjyothi.com





గంగమ్మ ఒడికి చేరిన గౌరమ్మ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 18) : మండలంలోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను గ్రామ కూడళ్ల వద్దకు చేర్చి మంగళహారతులు, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ లయబద్ధమైన చప్పట్లతో సంప్రదాయ పాటలు పాడుతూ కోలాటాలు ఆడటంతో పల్లెల్లో పండుగ శోభ వెల్లివిరిసింది. సాయంత్రం వేళ చెరువులు, కుంటల వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తిభావంతో నిమజ్జనం చేసి, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. మహిళల ఆటపాటలు, పూల పరిమళాల నడుమ సద్దుల బతుకమ్మ వేడుకలు కన్నుల పండువగా ముగిశాయి.



















కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

రాఖీ సావంత్‌కు నాన్-బెయిలబుల్ వారెంట్

2010 నాటి లక్ష్మణ్ అహిర్వార్ ఆత్మహత్య కేసుకు సంబంధించి బాలీవుడ్ నటి రాఖీ సావంత్‌కు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ ఫాస్ట్ ట్రాక్ కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఆ సమయంలో ప్రసారమైన 'రాఖీ కా ఇన్సాఫ్' రియాలిటీ షోలో దాంపత్య సమస్యల పరిష్కారం కోసం పాల్గొన్న లక్ష్మణ్ అహిర్వార్‌పై రాఖీ సావంత్ తీవ్రస్థాయిలో అవమానకర వ్యాఖ్యలు చేయడంతో మనస్తాపం చెంది ఆయన నవంబర్ 10న ఆత్మహత్య చేసుకున్నాడని, ఆమె వ్యాఖ్యలే తన కొడుకు చావుకు కారణమని తల్లి సావిత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ ఆమె విచారణకు హాజరుకాకపోవడంతో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ తదుపరి విచారణను డిసెంబర్ 1కి వాయిదా వేసినట్లు డిస్ట్రిక్ట్ గవర్నమెంట్ కౌన్సెల్ మృదుల్ కాంత్ శ్రీవాత్సవ తెలిపారు.



Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.